ప్రజాశక్తి
సోమవారం 26 మే 2025
5
విజయనగరం



విద్యార్థినిపై ఉపాధ్యాయుడు లైంగిక దాడి?

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలంలోని డివిడిఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై ఆ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఆ బాలిక గర్భం దాల్చినట్లు ఆలస్యంగా వెలుగు చూసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఆ ఉపాధ్యాయుడు పలువురు నాయకుల ద్వారా రాజీకి ప్రయత్నిస్తున్నట్లు మండలంలో చర్చ జరుగుతోంది. విషయం తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు పాఠశాలలో చదువుకునేందుకు వెళ్లిన విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులే ఇలాంటి దారుణాలకు పాల్పడితే పాఠశాలకు ఎలా పంపగలమని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని, ఫిర్యాదు వస్తే ఫోక్స్ చట్టం కేసు నమోదు చేస్తామని తెలిపారు.




నాయరాలవలస వద్ద కుచించుకుపోయిన మద్దువలస ప్రాజెక్ట్ పిల్ల కాలువ ; శిర్లాంతోట వద్ద అధ్వానంగా ఉన్న తోటపల్లి పిల్ల కాలువ

అధ్వానంగా సాగునీటి కాలువలు

ప్రజాశక్తి-రేగిడి

సాగునీటి ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఏళ్ల తరబడి ప్రాజెక్టుల ప్రధాన కాలువలు, వాటి పిల్ల కాలువల ఆధునీకరణ పనులు చేయకపోవడంతో శివారు గ్రామాలకు ఏటా సాగునీరు అందక రైతులు నష్టపోతునే ఉన్నారు. రాజాం నియోజకవర్గం లోని నాలుగు మండలాల భూములకు తోటపల్లి, మడ్డువలస జలాశయాల నుండి సాగునీరు సక్రమంగా అందక రైతులకు కడగండ్లే మిగులుతున్నాయి. ప్రధాన కాలువలకు లైనింగ్ పనులు లేకపోవడంతో పిల్ల కాలువలకు చుక్క నీరు కూడా రావడం లేదు. దీంతో ఆరుతడి పంటలకు కూడా సాగునీరు అందని దుస్థితి నెలకొంది.

తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ప్రధాన కాలువలకు లైనింగ్ పనులు, పిల్ల కాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టకపోవడంతో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా రేగిడి, సంతకవిటి, వంగర, గంగువారి సిగడాం మండలాల్లో 58 వేల ఎకరాలకు చుక్క నీరు కూడా అందడం లేదు. ప్రధాన కాలువలకు సాగునీరు అందక పిల్ల కాలువలకు సాగునీరు రాక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం ఆరుతడి పంటలకు కూడా చుక్క నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి రిజర్వాయర్ రాజాం కెనాల్ లో నుండి పిల్ల కాలువల తవ్వినప్పటికీ రాజాం -పాలకొండ ప్రధాన రహదారి చిన్నశిర్లాం జంక్షన్ వద్ద ప్రధాన రహదారిని తవ్వి సాగునీటిని పంపించాల్సి ఉంది. కానీ అనుమతులు లేక పిల్ల కాలువల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో తోకలవలస, తాటిపాడు, సోమరాజు పేట, సంతకవిటి మండలం గుల్ల సీతారాంపురం, ఇతర గ్రామాల పొలాలకు సాగునీరు అందక రైతులు నేల భావులు, చెరువులలో మోటార్లపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. మడ్డువలస రిజర్వాయర్ కు సంబంధించి గత టిడిపి హయాంలో కుడి ప్రధాన కాలువకు కొంతవరకు లైనింగ్ పనులు చేసి మిగతా పనులు వదిలేశారు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు ఈ రెండు ప్రాజెక్టులకు నిధులు సమకూర్చకపోవడంతో లైనింగ్ పనులు లేక పిల్ల కాలువలను ఆధునీకరణ పనులు ఊసే లేదు అని రైతులు వాపోతున్నారు. తోటపల్లి మడ్డువలస ప్రధాన కాలువ, వాటి పిల్ల కాలువల ఆధునీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపగా నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులపై దష్టి సారించి ఆధునీకరణ పనులకు నిధులు సమకూర్చి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందడం లేదు



తోటపల్లి, మడ్డవలస ప్రాజెక్టుల నుంచి శివారు గ్రామాలకు సాగునీరు అందడం లేదు. నేల బావులను, కొద్దిగా ఉన్న చెరువులలో మోటర్లు సహకారంతో వ్యయ, ప్రయాసలు పడి పంటలు పండిస్తున్నారు. ఆధునికీకరణ పనులను చేపట్టి సాగునీరు అందించాలి.

ఎ.సత్యం, సోమరాజుపేట

సాగునీరు అందిస్తే ఏడాదికి మూడు పంటలు



ఈ రెండు ప్రాజెక్టుల నుంచి ప్రధాన కాలువ , పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందిస్తే ఏడాదికి మూడు పంటలు పండించవచ్చు.. కనీసం ఖరీఫ్, రబీ పంటలకు కూడా తోటపల్లి, మడ్డవలస రిజర్వాయర్ నుండి సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు పండించేందుకు రైతులు, కౌలు రైతులు ముందుకు రావడం లేదు. కనీసం ఆరుతడి పంటల కైనా సాగునీరు లేదు. ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలి.

నారు జనార్ధనరావు, రేగిడి

నాలుగు పర్యాటక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

10న ఉపాధి హామీ సిబ్బందితో రాష్ట్ర స్థాయి కార్యక్రమం : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్/విజయనగరంటౌన్



ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరికి యోగా గొప్పతనాన్ని వివరించి, వారితో యోగాసనాలను అభ్యసింపజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతు మాధవన్ తెలిపారు. దీనిలో భాగంగానే ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన వందమంది మాస్టర్ ట్రైనీలు, టిఓటిలకు శిక్షణ ప్రారంభించామని చెప్పారు. రెండో రోజు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పరోక్షంగా శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు.

నాలుగు పర్యాటక ప్రదేశాల్లో...

జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో భారీ స్థాయిలో యోగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందని, దీని ప్రకారం ఈనెల 30న రామనారాయణం, జూన్ 6న చింతపల్లి బీచ్ వద్ద, 12న రామతీర్థం వద్ద, 19న తాటిపూడి రిజర్వాయర్ వద్ద యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు జెసి తెలిపారు. జిల్లాలో వేలాది మంది గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్కర్లతో జూన్ 10న యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

యోగా స్ట్రీట్స్ ఏర్పాటు

జిల్లా కేంద్రం విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పది యోగా వీధులను ఎంపిక చేశారు. రెండు రోజులకు ఒకసారి పట్టణంలోని ఏదో ఒక ప్రధాన మార్గంలో ఉదయాన్నే యోగాసన ప్రదర్శన నిర్వహిస్తారు. శిక్షణ పొందినవారితోబాటు, సామాన్య ప్రజలు సైతం ఈ యోగా స్ట్రీట్ కి వచ్చి ఆసనాలను అభ్యాసం చెయ్యవచ్చు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై యోగా ప్రదర్శన నిర్వహించడానికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జెసి సేతుమాధవన్ కోరారు.

యోగాంధ్రపై జిల్లాస్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు సంబంధించి సాంకేతికపరమైన సలహాలు సూచనలు అందించేందుకు 99490 42423 మొబైల్ నెంబర్‌తో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ వెల్లడించారు. ఎం.పృథ్వీరాజ్ అనే ఉద్యోగి ఈ ఫోన్ నెంబర్ లో అందుబాటులో ఉంటూ కాల్ సెంటర్కు వచ్చే ఫోన్ కాల్స్ కు సమాధానం ఇస్తారని తెలిపారు.

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల 27న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల యాజమాన్య సంస్థ తెలియజేసిందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని మండలాల తహసిల్దార్ లు, ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అల్పపీడన ప్రభావంతో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే అవకాశం ఉందని, పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించిన దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అన్ని మండలాలు డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు



వేపాడ మండలంలో కురుస్తున్న భారీ వర్షం

వేపాడలో భారీ వర్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో చామలాపల్లి, డిఆర్‌పేట, వెంకయ్యపాలెం, కరకవలస గ్రామాలలో నువ్వు పంట నీటమునిగింది. ఇక పంట చేతికి అంది వస్తుందనే సమయంలో వర్షం పడటంతో పొలాల్లో పెద్ద ఎత్తున నీరు చేరి పంట నాశనమైందని రైతులు వాపోతున్నారు. ఈ వర్షం ఖరీఫ్ వరి పంటలకు అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం నువ్వు పంట రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చిందని చెబుతున్నారు.

పేలుళ్ల కోసం ఐదుచోట్ల రెక్కీ

ఐదేళ్లకు పైగా ఉగ్రవాద కార్యకలాపాలపై శిక్షణ ?

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉగ్ర లింకుల వ్యవహారంలో అరెస్ట్ పోలీసుల కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లు విజయనగరం, హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు, ముంబాయిలో పేలుళ్ల కోసం రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. పోలీసు శిక్షణ కళాశాలలో మూడో రోజు సిరాజ్, సమీర్ లను కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఎన్ఐఎ టీములు విచారించాయి. వీరిద్దరూ సుమారు ఐదేళ్లుగా ఉగ్రవాద భావాలపై శిక్షణ పొందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సిరాజ్ పూర్తిగా ఆ భావజాలంపై ఆకర్షితులు ఆయినట్లు తెలుస్తోంది. ఉగ్రవాద సంస్థలు ఇచ్చిన శిక్షణ తో సురాజ్, సమీర్ దేనికైనా సిద్ధపడినట్లు సమాచారం.



ఇప్పటికే పలు ఉగ్రవాద పెద్దలను కలిసిన సిరాజ్, సమీర్‌లు ఆ పెద్దలతో మాట్లాడిన విషయాల పై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. అయితే ఆ విషయాలు చెప్పేందుకు సిరాజ్ నిరాకరించినట్లు తెలిసింది. సౌదీ హేండర్ల నుంచి అందినట్లు భావిస్తున్న నిధులపై కూడా కూపీ లాగినట్లు తెలిసింది.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విజయనగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అయ్యప్ప నగర్, కెఎల్ పురం, గురజాడనగర్, తోటపాలెం వైఎస్ఆర్ కాలనీ, రామకష్ణ నగర్, వేణుగోపాలపురం తదితర ప్రాంతాల్లో కుళాయిలు లేవన్నారు. నేడు నగరంలో ప్రజలకు తాగునీరు ఇవ్వాలంటే 40ఎంఎల్‌డి అవసరం కాగా, 16 ఎంఎల్‌డి మాత్రమే వస్తుందన్నారు. ఇంకా 24ఎంఎల్‌డి నీరు అవసరం ఉందన్నారు. ఆంధ్ర నుండి అక్కడ ఎమ్మెల్యేను అధికారులు బతిమాలాడుకొని తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. రామతీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తి చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని అన్నారు. అంత వరకు తాడి పూడి నుండి విశాఖపట్నంకు ఇస్తున్న నీటి అగ్రిమెంట్ 2019తో పూర్తి అయ్యింది కాబట్టి మన ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే తాడిపూడి నుండి విశాఖకు ఇచ్చే నీరు అపాలని కోరారు. ఆ నీటిని విజయనగరంలో స్టోరేజ్ పాయింట్‌లు ఏర్పాటు చేసి విజయనగరం ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించకపోతే ప్రజలు పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు యుఎస్ రవి కుమార్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే జెవివి లక్ష్యం

జిల్లా మహాసభలో డివిజి శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్




మహాసభలో మాట్లాడుతున్న డాక్టర్ డివిజి శంకర్రావు

అనేక రకాల సామాజిక రుగ్మతల నుండి ప్రజలను బయటకు తీసుకువచ్చి,వారిని చైతన్య పరిచే దిశగా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డివిజి శంకర్రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పనిచేసే జనవిజ్ఞాన వేదిక వంటి సంస్థలు ఈ దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. శాస్త్ర,సాంకేతిక విజ్ఞాన ఫలాలు ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రజలను శాస్త్ర విజ్ఞాన వైపు ప్రయాణించే దిశగా కషి కృషి చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయ శాఖ డిడి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా జెవివి పనిచేయడం అభినందనీయమని తెలిపారు. జెవివి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ 30 ఏళ్ల జనవిజ్ఞాన వేదిక ప్రస్థానంలో ఎన్నో సైన్స్ ఉద్యమాలను చేపట్టి విజయాలను సాధించిందని అన్నారు. అక్షరాస్యత,సారా వ్యతిరేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించామని తెలిపారు. అనంతరం సామాజిక కార్యకర్తలు బొడ్డేపల్లి రామకృష్ణారావు, మమ్ముల తిరుపతిరావులను ఈ సందర్భంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.శాంతికుమారి, జాతీయ నాయకులు గంద్రేటి లక్ష్మణరావు, గంద్రేటి అప్పలనాయుడు, రాష్ట్ర నాయకులు డాక్టర్ పైల రమేష్‌రాజు, సాహితీ స్రవంతి అధ్యక్షులు చీకటి దివాకర్, యుటిఎఫ్ నాయకులు నిర్మల, రాష్ట్ర, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కంటోన్మెంట్




క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఈనెల 4వ తేదీ నుండి 15వ తేదీ వరకు బీహార్‌లో జరిగిన 7వ ఖేలో ఇండియా కబడ్డీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు 3వ స్థానం సాధించింది. ఈ విజయంలో విశేష పాత్ర పోషించిన విజయనగరం పట్టణానికి చెందిన ఎం.రాంబాబు, కె. యశ్వంత్‌లను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఆదివారం అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నగరంలోని కామక్షినగర్ గ్రౌండ్‌లో మాతా బుజ్జి క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి జిల్లాకార్యాలయ కార్యదర్శి పూసపాటి రాజేష్ వర్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు మాతా బుజ్జి గత 14 ఏళ్లుగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం, 46వ డివిజన్ పరిధిలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు.. యువతను మంచి దారిలో వెళ్ళేలా తన వంతుగా సమాజానికి మంచి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు నిర్వకుడు మాతా బుజ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో అట్టాడ శ్రీను, కోరాడ సత్యనారాయణ, నల్లమారి, సందీప్, చిన్న, వినయ్ పాల్గొన్నారు.


రూ.470కోట్ల మద్యం విక్రయాలు



- కల్తీ, ఎంఆర్‌పి, రికార్డుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ
- 721 మందిపై బెల్టుషాపు కేసులు
- పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేవు
- 'ప్రజాశక్తి'తో ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీనాథుడు

ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు (నాలుగు నెలల్లో) సుమారు రూ.470 కోట్ల మద్యాన్ని విక్రయించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనాథుడు తెలిపారు. జిల్లాలో 153మద్యం షాపులకుగాను 17 షాపుల నుంచి రూ.55లక్షల చొప్పన, 136 షాపుల ద్వారా రూ.65లక్షల చొప్పన ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు రూపంలో ఆదాయం సమకూరుతుందని చెప్పారు. మద్యం దుకాణాల్లో కల్తీ నివారణ, ఎంఆర్‌పి అమలు, రికార్డుల నిర్వహణ తీరుపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 721 బెల్ట్‌షాపులను గుర్తించి, నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశామని వివరించారు. నాసిరకం మద్యం అంటూ ఎక్కడా ఉండబోదని, పర్మిట్ రూమ్‌లకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని స్పష్టం చేశారు. ఈవారం తనను కలిసిన ప్రజాశక్తికి శ్రీనాథుడు ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



నాసిరకం మద్యం విక్రయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి? మీ సమాధానం?

మద్యంలో నాసిరకం అంటూ ఏమీ ఉండదు. అందులో రకాలు మాత్రమే ఉంటాయి. రకాన్ని బట్టి ధరలు ఉంటాయి. ధరలు తక్కువైనంత మాత్రాన నాసిరకం మద్యం అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే ఏ రకం మద్యం తయారీకైనా 11రకాల పరీక్షలు నిర్వహించిన తరువాతే తయారవుతుంది. అందువల్ల అలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదు.

మంచి బ్రాండ్లను దుకాణాల్లో అందుబాటులో ఉంచడం లేదని సాక్షాత్తు ఎమ్మెల్యేలే విమర్శిస్తున్నారు?

సాధారణంగా డిమాండ్‌ను బట్టి సప్లయి ఉంటుంది. సంబంధిత దుకాణాల్లో ఏ రకం మద్యం ఎక్కువ సేల్ అవుతుందో అక్కడ ఆయా రకాలైన మద్యం మాత్రమే అందుబాటులో ఉంటుంది. అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని మేము చెప్తున్నాము. కానీ, వ్యాపారులు వారికి డిమాండ్ ఎక్కువగా వచ్చే రకాలనే ఎక్కువ శాతం విక్రయాలకు ఉంచడం సహజం. పెట్టుబడి పెట్టాక కూడా వెంటవెంటనే సేల్ అవ్వకపోతే వ్యాపారులు కూడా ఇబ్బంది పడే అవకాశాలు ఉంటాయి కదా.

పర్మిట్ రూములు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఉన్నాయా?

గతంలో మద్యం తాగేందుకు పర్మిట్ రూముల పాలసీ ఉండేది. పాలసీ మారిన తరువాత దీని గురించి ప్రత్యేకంగా మార్గదర్శకాలంటూ రాలేదు. కాబట్టి ప్రస్తుతం ఈ విధానం అమలులో లేదు. ప్రభుత్వం నుంచి మళ్లీ అనుమతులు వస్తే అటువంటి దేమైనా ఉంటుంది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరుగుతున్నట్టుగా సమాచారం ఉంది. ఈనేపథ్యంలో పర్మిట్ రూములు అంటూ అనధికారికంగా ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాల్సివుంటుంది.

బార్లలో ఎక్కువ ధర వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి?

ఎంఆర్‌పి అనేది మద్యం దుకాణాల్లో మాత్రమే వర్తిస్తుంది. బార్లలో ఎంఆర్‌పి అనేది ఉండదు. ఎందుకంటే అక్కడ ఎసి, సర్వెంట్, అక్కడే తిండిపదార్థాలు వంటివి అందుబాటులో ఉంటాయి. కాబట్టి, వాటికయ్యే ఖర్చును కలుపుకుని వారు ధర నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. అలాగని అక్కడ కల్పించిన సదుపాయాలకు మించి వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చు.

మద్యం కల్తీ నివారణ, ఎంఆర్‌పి అమలు విషయమై పర్యవేక్షణ ఎలా ఉంటోంది?

మద్యం దుకాణాల నిర్వహణ, ఎంఆర్‌పి అమలు, కల్తీ కోణంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఎపిటిఎటిఎస్ అనే యాప్ ద్వారా మద్యం సీసాకు ఉండే హీల్స్‌ను స్కాన్ చేస్తే మద్యం కల్తీ జరిగిందీ లేనిదీ తెలిసిపోతుంది. ఎక్కడ తయారై ఎలా వచ్చింది అన్నది కూడా స్పష్టమౌతుంది. నిల్వలకు సంబంధించి ఆర్-1, ఆర్-2 అనే రికార్డులను కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుంటాం. దుకాణానికి సింగిల్ డోర్ మాత్రమే ఉండాలి. సిసి కెమెరా కూడా తప్పనిసరి. వీటిలో ఏ రిమార్కు ఉన్నా డిపార్ట్‌మెంటల్ కేసులు నమోదు చేస్తాం. నరవ, గజపతినగరంలో ఒక చోట రిజిస్ట్రర్ నిర్వహణ సరిగా లేకపోవడంతో కల్తీ జరిగినట్టు గుర్తించి కేసులు నమోదు చేసి, చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశాం.

జిల్లాలో బెల్ట్ షాపుల ఏర్పాటు మితిమీరిపోతోంది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో 153 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటికి అనుబంధంగా (బెల్ట్ షాపులు) దుకాణాలు మరికొన్ని ఏర్పాటు చేసేందుకు నిబంధనలు అనుమతించవు. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపుల నివారణకు నిరంతరం దాడులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 721కేసులు పెట్టి, వీరందరికీ 41నోటీసులు అందజేశాం. రెండోసారి తప్పులు చేస్తే రిమాండ్‌కు కూడా వెళ్లాల్సివస్తుంది. ఇప్పటి వరకు కొత్తవలస, నెల్లిమర్ల మండలాల్లో ఇటువంటి కేసులు నమోదయ్యాయి.

మద్యం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఎలా ఉంది?

జిల్లాలో ఏర్పాటు చేసిన 153 మద్యం షాపులకు గాను 17 షాపుల ద్వారా రూ.55లక్షల చొప్పన, మిగిలిన 136 దుకాణాల ద్వారా రూ.65లక్షల చొప్పన లైసెన్సు ఫీజు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెండు నెలలకొకసారి ఆరు నెలల కాలపరిమితిలో ఈ ఫీజు కట్టాల్సి ఉంది.

జిల్లాలో మద్యం విక్రయాలు ఎంతమేర సాగుతున్నాయి?

ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రూ. 470కోట్ల మేర విక్రయాలు జరిగాయి. ఇందులో జనవరిలో రూ.130కోట్లు, ఫిబ్రవరిలో రూ.105కోట్లు, మార్చిలో రూ.123 కోట్లు, ఏప్రిల్‌లో రూ.112కోట్ల మేర విక్రయాలు జరిగాయి. ఇందులో జనవరిలో విక్రయించిన రూ.130కోట్లలో సుమారు రూ.54కోట్ల విలువైన మద్యం సంక్రాంతి పండగ మూడు రోజుల్లోనే అమ్ముడైంది. గత ఏడాదితో పోలిస్తే 10శాతం మద్యం విక్రయాలు పెరిగాయి.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలిలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలిలో ఈనెల 31న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు తైక్వాండో క్లబ్ అధ్యక్షులు, ఎమ్మెల్యే బేబినాయన, కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. తైక్వాండో పోటీలు పోస్టర్‌ను కోటలో ఆదివారం విడుదల చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో జూన్ 9,10,11న జరగనున్న తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీలలో 200మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు.

దళితులకు రక్షణ కరువు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర హోంమంత్రి నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేదని జై భీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాస రావు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం డోంకాడలో ఈ నెల 15న దళిత యువకులు వివాహ కల్యాణ మండపంలో లైటింగ్ పనులకు వెళ్లగా అక్కడ సెల్ ఫోన్ చోరీ అభియోగం మోపి టిడిపికి చెందిన అగ్రవర్ణాల నాయకులు కులం పేరిట దూషించి దళిత యువకులపై దాడి చేసి కొట్టారని ఆరోపించారు. 18న పంచాయతీకి చెందిన టిడిపి అగ్రవర్ణాలు వారు దళిత యువకులను మళ్లీ పిలిపించి లైట్లు అర్పివేసి తెల్లవార్లు వారిని కర్రలతో కొట్టి చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. దీంతో దళిత యువకులు ప్రాణభయంతో నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళితులపై దాడికి పాల్పడ్డ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

యశ్వంత్‌కు గొంప అభినందనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన జి.యశ్వంత్ కుమార్ ఇటీవల జరిగిన సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతోపాటు స్టేట్‌లో 23వ ర్యాంకు, ఆలిండియాలో 363వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తులసీ దంపతులు ఆదివారం అభినందించారు. భవిష్యత్తులో మంచి ప్రయోజకుడిగా ఎదగాలని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


యశ్వంత్‌ను అభినందిస్తున్న గొంప

కలెక్టరేట్ వద్ద నేడు ధర్నా

ప్రజాశక్తి - వంగర

మండలంలోని లక్ష్మింపేటలో జూన్ 12, 2012లో దళితుల మరణకాండకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని, పక్షపాతంగా వ్యవహరిస్తున్న లక్ష్మింపేట ప్రత్యేక కోర్టు జడ్జిని బదిలీ చేయాలని, 13 ఏళ్లుగా నిరీక్షిస్తున్న లక్ష్మింపేట దళిత బాధితులకు న్యాయం చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలి కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఉత్తరాంధ్ర దళిత సంఘాలు జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు దళిత సంఘ నాయకుడు చిత్తిరి గంగయ్య (గంగులు) ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బాధితులు తరఫున ప్రత్యేక కోర్టులో వాదించేందుకు తాము కోరుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పి.పి)గా సీనియర్ అడ్వకేట్ సవాబ్ హుస్సేన్ అక్బర్‌ను ప్రభుత్వం నియమించాలని కోరారు.


యువతతో మాట్లాడుతున్న సిఐ ఉపేంద్రరావు

మత్తుకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సంతకవిటి

గంజాయి మత్తుకు యువత దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు అన్నారు. ఆదివారం మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వల్ల కలిగే అనార్థాలు గూర్చి ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి క్రయవిక్రయాలు చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని ఇప్పటికే గంజాయిపై గట్టి నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎదురెదురుగా లారీలు ఢీకొని కూలీ మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రీన్ ఫీల్డ్ హైవేలో 386 మైలు రాయి రావి వలస గ్రామానికి వెళ్ళే దారి వద్ద హైవే పనులకు వినియోగించే డంపర్ లారీలు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇదే లారీలో ప్రయాణిస్తున్న కూలీ మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సైలాస్ సాహో (40) అక్కడికక్కడే మృతి చెందారు. లారీలు బలంగా ఢీ కొట్టడంతో అందులో ఉన్న సాహో ఆ దాటికి లారీ నుంచి కిందపడడంతో రెండు వాహనాల మధ్య చిక్కుకుని మృతి చెందాడు. ఇంకో కూలీ గాయాలతో బయటపడి చికిత్స పొందుతున్నాడు. మృతునికి వివాహం అయ్యి ఇద్దరు పిల్లలున్నట్లు తెలిపారు. బీహార్ నుంచి రోడ్డు పనులకు వచ్చి ప్రమాదంలో మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామనిపోస్ట్ మార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని దావాలపేట సమీపంలో రైల్వే గేట్ వద్ద రైలు నుంచి జారిపడిన వ్యక్తికి గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం కదులుతున్న రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులు గమనించి ఆ వ్యక్తి వివరాలు అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయగా ఆయన హిందీలో మాట్లాడటంతో వారికి అర్థం కాక 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జామి మండలం అలమండ గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై సుమారు 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు మృతి చెందారని విజయనగరం రైల్వే హెచ్‌సి మూర్తి తెలిపారు. మృతుని ఆచూకీ తెలియరాలేదని, మృతుని ఒంటిపై స్కై బ్లూ రంగు రౌండ్ నెక్ టీ షర్ట్, ఆకుపచ్చ రంగు గీత గల ముదురు నీలం రంగు షార్ట్ ధరించి ఉన్నాడని, కుడి చేతికి కాషాయం రంగు తాడు కట్టి ఉందని, ఆచూకీ తెలిసినవారు 9440591331, 9490617089 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

గ్రూపు రాజకీయాలు లేకపోతేనే అభివృద్ధి

ప్రజాశక్తి - వేపాడ

గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు లేకపోతేనే అభివృద్ధి సాధ్యమవుతోందని, అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని విశాఖ ఎంపి భరత్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వీలుపర్తిలో నిర్మించిన సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం, పాటూరులో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు లేకుండా ఎమ్మెల్యే బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో రెండు గ్రూపులుగా ఉంటే అభివృద్ధి సాధ్యం కాదని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని మనకు అధికారాన్ని కట్టబెట్టారని, ప్రజలకు ఇచ్చిన మాటలు ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని, ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి విడిచిపెట్టమని, తప్పనిసరిగా అమలు చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తనకు వచ్చిన నిధులను ప్రతి గ్రామానికీ అందేవిధంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయవద్దని చెప్పారు. ఈ మండలంలో తనకు అత్యధిక మెజార్టీ ఓట్లు వేయించిన రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, మండల కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కోళ్ళ బుచ్చి రాంప్రసాద్, వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీల, సేనాపతి అప్పారావు, పాటూరు సర్పంచ్ కె.వెంకట లక్ష్మి, ఉప సర్పంచ్ రమణమూర్తి, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పిఆర్ జెఇ ఆలీ, ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, దాసరి లక్ష్మీ పాల్గొన్నారు.

గేదెలవానిపాలెంలో బ్రిడ్జి ప్రారంభం

లక్కవరపుకోట: మండలంలో గేదెలవాణి పాలెంలోని ఉపాధి హామీ నిధులు సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు బ్రిడ్జిను ఎంపి భరత్‌కుమార్ ప్రారంభించారు.

కలిసికట్టుగా పనిచేయాలి : ఎంపి భరత్


లక్కవరపుకోట: బ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న ఎంపి భరత్, పక్కనే ఎమ్మెల్యే, గొంప కృష్ణ

ఎంపి చేతులు మీదుగా చెక్కులు పంపిణీ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి క్యాంపు కార్యాలయంలో ఆదివారం విశాఖ ఎంపి ఎం.భరత్‌కుమార్ పలువురుకు సిఎం సహనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవని లాంటిదన్నారు. ఈ సాయంతో లబ్ధిదారులు మరింత మెరుగైన వైద్య సహాయం పొందేందుకు వీలుంటుందన్నారు. అనంతరం రూ.7.17 లక్షలను ఎమ్మెల్యే లలితకుమారి ఆధ్వర్యంలో కరెడ్ల ఈశ్వరరావు, తోనంగి అప్పలస్వామి, బలం బాబురావు, ముమ్ములూరు అప్పన్న, కొట్టాడా ఈశ్వరరావు, చింతల సత్యవతి, నంబూరి వెంకటరమణ, కల్లూరి మంగేశ్వరి, కిలపర్తి గౌరినాయుడు, కోన సన్యాసిరావు, రాచపల్లి ఉమా మొత్తం 11 మందికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎపి టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు విశాఖ ఎంపి భరత్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని బొడ్డవర గ్రామం నుంచి చిట్టెంపాడు గ్రామానికి 11 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అదనపు వసతుల కోసం రూ. 6కోట్ల వ్యయంతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, గొంప కృష్ణ, జిఎస్ నాయుడు, వబ్బిన సత్యనారాయణ నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ పై వంతెనకు ఎంపి శంకుస్థాపన

జామి: మండలంలోని విజినిగిరి, తానవరం గ్రామాల మధ్య గల గోస్తనీ నదిపై వంతెనకు విశాఖ ఎంపి భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అనువుగా వంతెన నిర్మాణం చేయడం ఏళ్లనాటి సమస్య పరిష్కారానికి నోచుకుందని అన్నారు. అంతకముందు రాంబద్రపురం అగ్రహారం గ్రామంలో రూ. కోటితో బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, జెడ్‌పిటిసి సరయు, ఎంపిపి అరుణ, విజినిగిరి సర్పంచ్ సూర్యారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యా? ఆత్మహత్యా?

◆హత్యేనంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుని తండ్రి

◆సమాధి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి విచారణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడలో ఆదివారం బొడ్డు భూలోక (36) ఇంట్లో ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. బంధువులు కుటుంబీకులు శ్మశానంలో ఖననం చేశారు. అనంతరం ఎవరింటికి వారు వెళ్ళిపోయారు. మృతుని తండ్రి అప్పన్న మాత్రం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి బడి సూరిబాబు, బొడ్డు అశోక్, బొడ్డు చిన్న భూలోక, బొడ్డు అప్పలస్వామి నా కొడుకుని హత్య చేసి కననం చేశారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. వెంటనే భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణతోపాటు పూసపాటిరేగ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఖననం చేసిన మృతదేహాన్ని బయటికి తీయించి విచారణ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు.

గ్రామస్తులందించిన వివరాలు ప్రకారం మృతుడు భూలోకకు, ఫిర్యాదులో పేర్కొన్న నలుగురూ బంధువులు. వీరి మధ్య శనివారం రాత్రి స్వల్ప వివాదం జరిగింది. ఈ క్రమంలో మృతునికి నిందుతులుగా గుర్తించిన నలుగురి మధ్య కొట్లాట జరిగింది. ఇందులో భాగంగా మృతుడు భూలోక సూరిబాబును తలపై కొట్టడంతో ఆయనకు గాయమైంది. దీంతో సూరిబాబు భోగాపురం సిహెచ్‌సిలో వైద్యం చేయించుకున్నాడు. అనంతరం శనివారం రాత్రి 11 గంటల సమయంలో మృతుడు తండ్రి అప్పన్న, మృతుని తమ్ముడు రాము, మృతుడు భూలోక కలిసి మద్యం సేవించి పడుకున్నారు. తెల్లవారు జామున చూసేసరికి భూలోక తన ఇంట్లో ఉరేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని కిందకు దించి గుట్టుచప్పుడు కాకుండా కుటుంబీకులతో పాటు ఆ నలుగురు నింది తులు బంధువులు కలసి శ్మశాన వాటికలో భూలోక మృతదేహాన్ని ఖననం


భూలోక మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న పోలీసులు

చేశారు. అయితే మృతుడు తండ్రి అప్పన్న మాత్రం ఆ నలుగురే తన కుమారుడుని చంపేశారంటూ రోదిస్తున్నాడు. హత్య, ఆత్మహత్య అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడు మద్యం మత్తులో పలుమార్లు ఉరేసుకోవడానికి ప్రయత్నం చేసినట్లు బంధువులు చెప్తున్నారు. శనివారం రాత్రి కూడా మద్యం మత్తులో ఉరేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే కుటుంబీకులతో పాటు గ్రామస్థులకు ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణ అనంతరం హత్య ఆత్మహత్య అన్నది తేలాల్సి ఉంది.

అనాథలైన పిల్లలు

మృతుడు భూలోకకు ఇద్దరు కుమార్తెలు హర్షిని, రజినితో పాటు కుమారుడు అక్షయ వర్ధన్ ఉన్నాడు. భార్య రెండేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందింది. తల్లితో పాటు తండ్రిని కూడా కోల్పోయి పిల్లలు అనాథలుగా మిగిలిపోవడంతో కన్నీటి పర్యంత మవుతున్నారు.


అనాథలైన పిల్లలు

పేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదలకు అండగా సీఎం సహాయనిది ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. తెర్లాం మండలం అప్పలంపేటకు చెందిన కె.శిరీషకు సిఎం సహయ నిధి మంజూరు కావడంతో కోటలో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు రూ.85వేలు చెక్కును అందించారు. పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి దోహదం చేస్తుందన్నారు.

నేడు సీతంపేటలో పిజిఆర్ఎస్

సీతంపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను సోమవారం సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతంపేట ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు అందరూ సోమవారం సీతంపేటలో జరిగే పిజిఆర్ఎస్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

కంటి శస్త్రచికిత్సకు 55మంది ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేటలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 55మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. ఆదివారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీఅన్నపూర్ణ సహిత జ్ఞాన లింగేశ్వర ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 15 గ్రామాల నుంచి 140 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 55 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికచేశారు. వీరిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సహకారంతో సాధన యువజన సంఘం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, ఉపాధ్యాయులు మద్దిల సన్యాసిరావు, తాలాడ మహేష్, మద్దిల సత్యనారాయణ, కొండపల్లి జైరాం, మద్దిల దుర్గశేఖర్ బాబు, కాళ్ళ మహేష్, పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు, సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుభోతు దుర్గాప్రసాద్ రావు, ఉపాధ్యక్షులు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు తుమ్మ అశోక్, నామాల శ్రీను, కనకల గణేష్, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ సి.హెచ్ వెంకటరమణ, ఆప్తో మాట్రిస్ట్ ఆర్ సురేష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆరోగ్యకరమైన జీవన శైలితో వ్యాధులకు దూరం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించటం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని పురపాలక సంఘ చైర్మన్ శరత్, పట్టణ టిడిపి అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం 5వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పురపాలక సంఘం చైర్మన్ శరత్, రోటరీ ఫౌండేషన్ చైర్, పట్టణ టిడిపి అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, 5వ వార్డు కౌన్సిలర్ హైమావతి ప్రారంభించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్ మాట్లాడుతూ అంతర్జాతీయ థైరాయిడ్ నివారణ దినోత్సవ నేపథ్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ థైరాయిడ్ స్థాయిలను అదుపులో ఉంచుకోవటానికి ఆహారం ప్రధాన పాత్ర పోశిస్తుందని అన్నారు. ప్రోటీన్లు, విటమినులు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారం తీసుకుంటే థైరాయిడ్ దరిచేరదన్నారు. ఈ సందర్భంగా 5,6వ వార్డులకు చెందిన 93 మందికి ఉచితంగా థైరాయిడ్ పరీక్షలు చేశారు. అనంతరం రోటరీ క్లబ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అతిథిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.


వైద్య తనిఖీ చేస్తున్న డాక్టర్


ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1997-2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా చాలా ఏళ్ల తర్వాత కలుసు కోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం పలుసేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహణకు తీర్మానం చేశారు.

బ్యాడ్మింటన్ శిక్షణలో గుడ్డు, పాలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 25 రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు, వారి మిత్ర బృందం శిక్షణ పొందుతున్న 105 మంది క్రీడాకారులకు పౌష్టిక ఆహారం గుడ్లు, పాలు చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘురాజు క్రీడాకారులతో మాట్లాడుతూ ప్రతి క్రీడాకారునికి గుడ్డు, పాలు చాలా మంచి శక్తినిస్తాయని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజు తీసుకోవాలని, మంచి క్రీడాకారులుగా తయారై ఎస్ కోటకు జిల్లాకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి.సత్యకర్, స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మంథా సుబ్బారావు, అట్లూరి శ్రీ వెంకట్రావు, ఆనల మోహన్, ఆనల రమేష్, పి.ఆర్ షటిల్ కోర్ట్ సభ్యులు, తల్లిదండ్రులు క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు గుడ్డు, పాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

జూలై 5న లోక్ అదాలత్

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

జూలై 5న సుప్రీమ్‌కోర్టు ఆదేశాలు మేరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నామని ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ తమ స్టేషన్‌లో 40 వరకు రాజీ పడదగిన కేసులు ఉన్నాయన్నారు. రాజీ పడదగిన కేసులు అన్నీ కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కక్షదారులందరినీ మోటివేట్ చేసి రాజీ పడేటట్లు కృషి చేస్తున్నామన్నారు. ఇరు వర్గాలు కూడా ఒకరు గెలిచాం మరొకరు ఓడిపోయామని కాకుండా ఇద్దరూ గెలిచామని అభిప్రాయంతో సానుకూల వాతావరణంలో సహకరించి జాతీయ లోక్ అదాలత్ లో కేసులను రాజీ పడేవిధంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

రూ.7.10 కోట్లతో బిటి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొండవలస, చిన్నకోడిశ, పెద్దకోడిశ, సరసనాపల్లి, జోడుబందల, అంబాడ, లక్ష్మింపురం, లింగాలవలస గ్రామాల బీటీ తారు రోడ్డుకు ఆదివారం ఎమ్మెల్యే కొండ్రు మురళి మోహన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు వంటివని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధిని గాలికి వదిలేయడంతో గ్రామాలు కుంటిపడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టి, అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతోందన్నారు. జూన్ నెలలో రైతుల ఖాతాలో 20వేలు జమ చేయనున్నారన్నారు. చదువుతున్న ఆడబిడ్డలకు ఎంతమంది ఉంటే అంతమందికి 15 వేలు అందిస్తారన్నారు. ఆగస్టు 15కు ఉచితంగా బస్సుల్లో మహిళలకు ప్రయాణానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో గల గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ పనులైనా ఉంటే త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండ్రు జగదీష్, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, పిన్నింటి మోహనరావు, గురవాన నారాయణ రావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, గురవాన రమేష్, కడగల నాగరాజు, దుప్పల పూడి శ్రీను, వంగా వెంకటరావు, ముగడ శ్రీను, గురవాన ధనుంజయ, నల్లి భాస్కరరావు, పైల కామేశ్వరరావు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీ

సమైక్యత యాత్రలో పాల్గొనండి

ప్రజాశక్తి - కొత్తవలస

దేశ సమైక్యత యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ అన్నారు. ఆదివారం కొత్తవలసలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం మోడీ విధానాలకు మోకరిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద వ్యతిరేక విధానాలు, అమెరికాకు లొంగుబాటు విధానం దేశ సమగ్రతకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి చొరబాట్లలో అమెరికా హస్తం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం దేశంలో మతపరమైన విభేదాలు సృష్టిస్తుందన్నారు. ఈ దాడిని యావత్తు భారతదేశ ప్రజలు విమర్శిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, జిల్లా పాడి రైతు సంఘం సభ్యులు గొంప కృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న టివి రమణ

మత సామరస్యాన్ని కాపాడాలి

బొబ్బిలి: మత సామరస్యాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం కోరారు. దేశ సమగ్రత, మత సామరస్యాన్ని కాపాడాలని ఆదివారం సిపిఎం కార్యాలయంలో ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యం, దేశ సమగ్రతకై ఈ నెల 20 నుంచి 30 వరకు సమైక్యత యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. సమైక్యత ప్రచార పత్రాలను ఆదివారం సిపిఎం కార్యాలయంలో విడుదల చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది భారతీయులు మరణించడం బాధాకరమన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం చేయాల్సిన కేంద్రం అమెరికాకు లొంగిపోయిందని విమర్శించారు. ఈ నెల 29న తాపీ పనివారాల సంఘం కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.ప్రసాద్, రెడ్డి త్రినాధ పాల్గొన్నారు.